


ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువపత్రంతో వర్షప్రియ


తయారు చేసిన వస్తువులు

చూడచెక్కని ప్రతిభ

ప్రస్తుతం యువత ఎక్కువగా సామాజిక మాధ్యమాలను కాలక్షేపానికే వినియోగిస్తున్నారు. విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఇలాంటి రోజుల్లో ఈ అమ్మాయి తన ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఇన్‌స్టాగ్రామ్‌ను వేదికగా చేసుకుంది. తనలోని సృజనాత్మకతకు పదును పెడుతూ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటోంది. సుద్దముక్కలు, పెన్సిళ్లపై అక్షరాలు, బొమ్మలు చెక్కుతూ ఔరా అనిపించుకుంటోంది. ఇటీవల కేవలం 17 నిమిషాలు 15 సెకన్లలో పెన్సిల్‌పై ఆంగ్లంలో ఎ నుంచి జడ్ వరకు అక్షరాలను చెక్కి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.

శ్రీకాకుళం నగరానికి చెందిన బోటు వర్షప్రియ చిన్నతనం నుంచి కళాకృతులను రూపొందించడంలో ప్రత్యేక ఆసక్తి కనబరిచేది. ఎక్కువగా 'మెయిండింగ్స్' వేయడం, 'పేపర్‌తో ఆకర్షణీయమైన డిజైన్లను తయారు చేసేది. సుద్దముక్కలు, పెన్సిళ్లపై పేర్లు, బొమ్మలు చెక్కేది. ఇంటర్ పూర్తయ్యాక డిజైనింగ్ కోర్సుల్లో చేరాలనుకుంది. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా అది సాధ్యపడలేదు. అయితేనేం వెనక్కి తగ్గలేదు. ప్రస్తుతం ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. చదువుకుంటూనే తన కళా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుంటోంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడా ఇంట్లో అమర్చుకునే ఆకృతులను తయారు చేస్తోంది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తింపు కోసం గతంలో నాలుగు సార్లు ప్రయత్నించి విఫలమైంది. తర్వాత ఇన్‌స్టాగ్రామ్ పేజీని ప్రారంభించింది. తయారు చేసే ప్రతి వస్తువును అందులో పోస్టు చేసేది. వాటిని తక్కువ ధరకే విక్రయిస్తూ ఆ డబ్బులను పరీక్ష ఫీజులు, ఇతర ఖర్చులకు వినియోగించుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదిక ద్వారానే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు దరఖాస్తు చేసుకుని సఫలమైంది. స్నేహితులు, బంధువులకు బహుమతులను సైతం తానే సొంతంగా తయారు చేసి ఇస్తోంది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రతి అమ్మాయిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, అలా చేస్తే ఎవరైనా నేర్చుకోవడానికి, సాధించడానికి వీలుంటుందని చెబుతోంది వర్షప్రియ.

– న్యూస్‌టుడే, టెక్కలి, శ్రీకాకుళం అర్బన్

ఆదిత్యాలయ ఈవో బాధ్యతల స్వీకరణ



శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ఈవోగా భద్రాజీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈవోగా పని చేసిన రమేష్‌బాబు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌గా కాకినాడకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ప్రభుత్వం ఈయనను నియమించినట్లు సంగతి తెలిసిందే. ఆయనతో పాటు ఆలయ పర్యవేక్షకుడిగా ఎస్. కనకరాజు, సీనియర్ సహాయకుడు ఎ. శ్రీనివాసరావు, ఎ. శోభనాద్రిచార్యులు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఈవోకు జిల్లా దేవాదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, శ్రీకూర్మం ఆలయ ఈవో గురునాధరావు, అర్చకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉప్పొంగిన యువోత్సాహం






యువత ఆటపాటలతో అందరినీ అలరించారు. ప్రతిభ చూసి న్యాయనిర్ణేతలు మెచ్చుకున్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థల్లో జిల్లా యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యువజనోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఎన్ ఈశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వ్యక్తిగత, బృంద విభాగాల్లో నృత్యం, పాటలు, కవిత్వం, కథన రచన, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. వాటిల్లో వివిధ కళాశాలల నుంచి 500 మంది పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు యువజన సర్వీసులశాఖ సీఈవో ఎం.ప్రసాదరావు స్పష్టం చేశారు. న్యాయనిర్ణేతలుగా బి.నీరజాసుబ్రహ్మణం, ఏబీ అనూరధ, డా. కె.ఎం.కృష్ణ, వంగా మహేష్, సీహెచ్ అప్పలనాయుడు, జి.గోపాలరావు వ్యవహరించారు. సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణరావు, డీఎస్‌డీవో కె.శ్రీధర్‌రావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ, పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

ఆరుగురు సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కల్పిస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో ఆరుగురు సీఐలకు బదిలీలు జరిగాయి. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న జి.శ్రీనివాసరావును డీసీఆర్‌బీకి, కృష్ణారావును టాస్క్‌ఫోర్స్, సూర్యచంద్రమౌళిని సీసీఎస్, ఎ.కృష్ణమూర్తిని శ్రీకాకుళం పోలీసు శిక్షణ కేంద్రం, వి.రామారావును పాతపట్నం సీఐగా బదిలీ చేశారు. పాతపట్నం సీఐ నల్లి సాయిని వీఆర్‌కు పంపారు.

దూసిలో మహాత్మాగాంధీ స్మారక కేంద్రం


ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం దూసి రైల్వేస్టేషన్‌లో మహాత్మాగాంధీ స్మారక కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. విశాఖ ఇంటాక్ సంస్థ ప్రతినిధులు గతంలో రైల్వే అధికారులకు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ మేరకు రైల్వే అధికారుల బృందం స్టేషన్‌లో బాపూజీ పర్యటించిన స్థలాన్ని పరిశీలించింది. వాల్తేరు డివిజన్ ఈస్ట్‌కోస్ట్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, ఇంటాక్ ప్రతినిధులు నూక సన్యాసిరావు, పొన్నాడ రవికుమార్, శ్రీకాకుళం రోడ్ స్టేషన్ మేనేజర్ ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.

లయ తప్పుతోంది..!

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

– న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)

..ఓ వైపు మారుతున్న ఆహారపు అలవాట్లు.. చెడు వ్యసనాలు.. మరో వైపు క్షణం తీరిక లేని జీవితం.. మానసిక ఒత్తిళ్లు.. ఇవన్నీ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.. చిన్న వయసులోనే గుండె సంబంధిత రుగ్మతలతో ఆసుపత్రుల బాట పట్టిస్తున్నాయి. కొవిడ్ అనంతరం గుండెపోటు బాధితుల సంఖ్య మరింత పెరిగింది. ముందుగా గుర్తించకుండా చాలామంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలోనూ బాధితుల సంఖ్యల రోజురోజుకీ అధికమవుతోంది. నేడు 'ప్రపంచ హృదయ దినోత్సవం' సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..



చిన్న వయసులోనే స్టెంట్లు, శస్త్రచికిత్సలు

ఆర్థికంగా కుదేలవుతున్న కుటుంబాలు

● పలాసకు చెందిన 29 ఏళ్ల ఓ యువకుడు ఒంట్లో నలతగా అనిపించినా నిర్లక్ష్యం చేశారు. గుండె నొప్పి లక్షణాలు కనిపించినా పట్టించుకోలేదు. ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా ప్రాణాలు దక్కలేదు.

● శ్రీకాకుళం నగరానికి చెందిన 21 ఏళ్ల యువకుడికి గుండె మంట వచ్చింది. రెండు రోజుల పాటు అవే లక్షణాలు వచ్చినా సాధారణ గ్యాస్ట్రిక్ మంటగా భావించి నిర్లక్ష్యం చేశారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. యువకుడే కదా గుండె నొప్పి రాదనే నిర్లక్ష్యం ప్రాణం మీదకు వచ్చింది.

జీవనశైలిలో మార్పులే గుండెపోటుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా యువతలో గుండె సమస్యల బాధితులు పెరుగుతున్నారు. జిల్లాలోని నగరాలు, పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ అందరి ఆహారపు అలవాట్లు మారిపోయాయి. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు జంక్, ఫాస్ట్‌ఫుడ్స్, మాంసాహారం, మసాలా కూరలు, బిర్యానీలు ఎక్కువగా తింటున్నారు. వాటి వల్ల శరీరంలో కొవ్వుశాతం పెరిగిపోయి ఆయాసం, నీరసం, ఇతర సమస్యలకు కారణమవుతోంది. ఫలితంగా గుండె పనితీరు మందగిస్తోంది. దీనికి ఒత్తిడి, మానసిక ఆందోళన, రక్తపోటు, మధుమేహం వంటివి తోడై గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలపై ప్రభావం పడి కుప్పకూలిపోతున్నారు.

కొంప ముంచుతున్న నిర్లక్ష్యం..

సాధారణంగా గుండె సంబధిత సమస్యలు 50 ఏళ్లు దాటిన, వయసు మళ్లిన వారికి వస్తాయనే అపోహలో చాలమంది యువత ఉన్నారు. దీంతో ఆరోగ్యంపై దృష్టిసారించడం లేదు. గుండెల్లో మంట వచ్చినా, నలతగా అనిపించినా అది సాధారణ సమస్యగా భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొన్నిసార్లు అవి గుండెపోటుకు దారి తీసి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ప్రస్తుత కాలంలో అన్నివయసుల వారూ అప్రమత్తంగా ఉండాలని గుండె సమస్యల లక్షణాలపై అవగాహన పెంచుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి...



ఇటీవల యువత గుండె సంబంధిత వ్యాధులతో ఎక్కువగా బాధపడుతున్నారు. జంక్‌ఫుడ్ తీసుకుంటూ.. వ్యాయామం లేకుండా ఉద్యోగాలతో కాలం గడిపేయడం గుండెపోటుకు కారణంగా మారుతోంది. సకాలంలో గుర్తిస్తే స్టెంట్ వేసి ఆరోగ్యం కాపాడుకోవచ్చు. లేదంటే ప్రమాదమే. హృద్రోగ లక్షణాలతో బాధపడే వారు ఏడాదికి ఒకసారి, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత చికిత్స పొందుతున్నవారు ఆరు నెలలకో సారి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ బుడుమూరు అన్నాజీరావు, హృద్రోగ నిపుణుడు, మెడికవర్ ఆసుపత్రి

సర్వజనాసుపత్రిలో ప్రత్యేక విభాగమేదీ..?

జిల్లా జనాభా సుమారుగా 28 లక్షలు. అందుబాటులో ఉన్న హృద్రోగ నిపుణులు మాత్రం పది మందిలోపే ఉన్నారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అసలు హృద్రోగ విభాగమే లేదు. గుండె పోటుతో వచ్చే వారికి ప్రాథమిక వైద్యం చేసి కేజీహెచ్, ఇతర ఆసుపత్రులకు పంపించేస్తున్నారు. దీంతో పలువురు మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ లెక్కలేనన్ని ఉన్నాయి.




తగినంత నిద్ర అవసరం.. ప్రస్తుతం రోజుల్లో విద్యార్థులు, ఉద్యోగులు అంతా ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే ఎక్కువ మంది హృద్రోగాల బారిన పడుతున్నారు. ఏమైనా లక్షణాలు గుర్తిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. రోజూ నడక, వ్యాయామంతో పాటు ధ్యానం, యోగా అలవాటు చేసుకోవాలి. తగినంత నిద్రపోవాలి.

– డాక్టర్ కిల్లి సతీష్, వైద్య నిపుణుడు, కిమ్స్ ఆసుపత్రి



జీవనశైలిలో మార్పు అవసరం.. 18 నుంచి 45 ఏళ్లలోపువారు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా జీవన శైలిని మార్చుకోవాలి. బయట దొరికే ఆహార పదార్థాలను వీలైనంత వరకు దూరం పెట్టాలి. మద్యం, పొగాకు వంటివీ గుండె కండరాలపై ప్రభావం చూపుతాయి. నూనె తక్కువగా ఉన్న పదార్థాలు తినడం ఉత్తమం. వ్యాయామం దినచర్యలో భాగం చేసుకోవాలి.

– డాక్టర్ బరాటం సాయితేజ, వైద్య నిపుణుడు, జెమ్స్ ఆసుపత్రి



ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని కేసులు వందల సంఖ్యలో ఉంటున్నాయి.

అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కొత్త కమిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రకటన విడుదల చేయాలని, 8 మంది సభ్యుల్లో నలుగురు ఎస్సీ, ఒక ఎస్టీ, ఇద్దరేసి బీసీ, ఓసీలు ఉండేలా చూడాలని చెప్పారు. రానున్న మూడు నెలల్లో నిర్వహించే సమావేశానికి నూతన కమిటీ ఏర్పాటు కావాలన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గతేడాది అట్రాసిటీ కేసుల వివరాలను వెల్లడించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలపై దాడులు, భూకబ్జాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి గొండు శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అట్రాసిటీ కేసులతో అన్యాయం జరిగిందని వివరించారు. భూదందాల కారణంగా నష్టపోయినవారిని ఆదుకోవాలని సూచించారు. సమావేశంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్వో ఎం.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


కొత్తవూరు సమీపంలో దేవాలయ భూముల్లోని రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

ఆలయ భూముల్లో కబ్జా పర్వం..!

– కాశీబుగ్గ, న్యూస్‌టుడే

పలాస మండలం తర్లాకోట రెవెన్యూ పరిధి (కొత్తవూరు)లో పలు దేవాలయాలకు వందలాది ఎకరాల భూములున్నాయి. ఆయా భూముల్లోని పలు భాగాల్లోని పంట పొలాలను, గుట్టలను కొంతమంది స్థిరాస్తి వ్యాపారానికి సిద్ధం చేస్తున్నారు. గత కొంతకాలంగా ఈ వ్యవహారం జరుగుతూనే ఉంది.

పలాస పట్టణానికి దగ్గరగా ఉండే కొత్తవూరు ప్రాంతంలో గోపినాథస్వామి, వరదరాజుల స్వామి, నీలకంఠేశ్వర స్వామి పేరుమీద వందలాది ఎకరాల భూములున్నాయి. వాటిలో గోపినాథ స్వామి పేరుతో సుమారు 7.50 ఎకరాల వరకు భూములుండగా అందులోని కొంత భాగంలో పంటలు పండిస్తున్నారు. మిగిలిన భాగంతో పాటు సుమారు 50 సెంట్ల విస్తీర్ణంలో రాళ్ల గుట్ట ఉంది. ఈ గుట్టలోని రాళ్లను వారం రోజులు కిందట రాత్రి వేళ పేల్చడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే వరదరాజులు స్వామి పేరున ఉన్న భూములను పక్కనున్న జిరాయితీ నంబర్లతో విక్రయాలు జరిపి అందులో నిర్మాణాలు సైతం చేపట్టిన పరిస్థితి ఉంది. ఇక్కడ ఎకరా రూ.కోటిపైనే పలుకుతోంది. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. దేవాదాయ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు ఇప్పటికైనా దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. దీనిపై తహసీల్దార్ సత్యం మాట్లాడుతూ దేవాదాయ భూముల్లో స్థిరాస్తి వ్యాపారం చేయరాదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, టెక్కలి

కుటుంబంలో ఎవరైనా రాజకీయాల్లో ఉంటే అటు వైపే అడుగులేయాలనుకుంటున్న వారసులు ఉన్న ఈరోజుల్లో తన తండ్రి ఎమ్మెల్యే అయినా ఆయన మాత్రం సగటు ప్రభుత్వ ఉద్యోగి జీవితానికే మొగ్గుచూపారు.

ఎస్సై నుంచి ఎస్పీ వరకు..

● ఉన్నత స్థానానికి ఎదిగిన నిమ్మాడ వాసి


కింజరాపు వెంకటరామకృష్ణప్రసాద్

తమ కులం వాళ్లో, తనకు తెలిసినా వారో అధికారంలో ఉంటే మంచి పోస్టింగుల కోసం వెంపర్లాడే ఉద్యోగులున్న ఈ రోజుల్లో.. తన సొంత పెదనాన్న కుమారులు కింజరాపు ఎర్రన్నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పదవుల్లో ఉన్నప్పటికీ ఏరోజూ ప్రధాన స్థానాల్లో ఆయన పోస్టింగుల కోసం ప్రయత్నించలేదు. ఎస్సైగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ఎస్పీగా ఎదిగిన కింజరాపు వెంకట రామకృష్ణప్రసాద్ ప్రస్థానం ఆదర్శంగా నిలుస్తోంది.

అనిశాలో ప్రత్యేక గుర్తింపు..

రామకృష్ణప్రసాద్ తండ్రి కింజరాపు కృష్ణమూర్తినాయుడు హరిశ్చంద్రపురం నియోజకవర్గానికి 1973- 78 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 1989లో ఎస్సైగా విశాఖ జిల్లా కృష్ణదేవుపేటలో విధుల్లో చేరిన రామకృష్ణప్రసాద్ 1999లో సీఐగా పదోన్నతి పొంది అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ)లో బాధ్యతలు చేపట్టారు. దాదాపుగా ఇన్‌స్పెక్టర్‌గా పని చేసినంతకాలం ఏసీబీలో పనిచేశారు. 2009లో డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందాక ఏసీబీలోను, మెరైన్ విభాగంలో కొన్నాళ్లు చేశారు. ఆ సమయంలోనే శ్రీలంక నుంచి అక్రమ చొరబాటుదారులను పట్టుకుని గుర్తింపు పొందారు. ఏసీబీ అధికారిగా ఎంతో మంది రాష్ట్రస్థాయి అధికారులను అవినీతి కేసుల్లో పట్టుకుని సత్తాచాటారు.

పురస్కారాలు.. ప్రశంసలు..

విధి నిర్వహణలో ఎన్నో కేసులను ఛేదించి ఆరు నగదు పురస్కారాలు, ఏడు సార్లు ప్రశంసలు పొందారు. 2001లో రాష్ట్ర పోలీసు సేవాపతకం, 2010లో జాతీయసేవా పోలీసు పతకం, 2019లో రాష్ట్రపతి సేవాపురస్కారం లభించింది. 2020లో అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన ఆయన అనంతపురం, పుట్టపర్తిలో బాధ్యతలు నిర్వహించారు. 2023 జూన్ నుంచి ఎస్ఈబీ అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 31న నాన్‌క్యాడర్ ఎస్పీగా పదోన్నతి కల్పించింది. ఏపీఈపీడీసీఎల్‌లో విజిలెన్స్ అధికారిగా నియమించింది. విధి నిర్వహణలో మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తమ ఊరి బిడ్డ ఎస్సై నుంచి ఎస్పీగా ఎదగడంతో స్వగ్రామం నిమ్మాడలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

బదిలీలు పారదర్శకంగా చేపట్టడం అభినందనీయం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు యాజమాన్యంలో వివిధ క్యాడర్లకు చెందిన 268 ఉద్యోగుల బదిలీలు ఎలాంటి విమర్శలకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టడం అభినందనీయమని జిల్లా పీఆర్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు, జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, జడ్పీ సీఈవో ఆర్. వెంకట్రామన్‌తో పాటు ప్రభుత్వానికి తమ సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





RAMOJI FILM CITY



సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పోలీసు అధికారులు, కళాశాల ప్రతినిధులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగంతో బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని, యువత వాటికి దూరంగా ఉండి సమాజాన్ని చైతన్య పరచడంలో భాగస్వాములు కావాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సూచించారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల్లో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత సానుకూలమైన అంశాల కంటే ప్రతికూల అంశాల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. కళాశాలల పరిసరాల్లోనే ఎక్కువగా గంజాయి వాడకం జరుగుతోందన్నారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ కమిటీ సభ్యులకు పోలీసుశాఖ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్ అవగాహన గోడ ప్రతులను ఆవిష్కరించారు. విద్యాసంస్థల డైరెక్టర్ డా.బుడుమూరు శ్రీరామమూర్తి, యాజమాన్య సభ్యులు ఇప్పిలి కిశోర్, బి.రఘుకార్తీక్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, సీఐలు అవతారం, పైడపు నాయుడు, స్వామినాయుడు, ఎస్సైలు సందీప్, చిరంజీవి, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి గుజరాత్ వయా ఇచ్ఛాపురం

● గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి ఇచ్ఛాపురం మీదుగా గుజరాత్‌కు 8.160 కిలోల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎం.చిన్నంనాయుడు శనివారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశాలోని పొలసరకు చెందిన సింహాచల మహంతి అలియాస్ సింహా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గంజాయి రవాణాతో ఎక్కువ సొమ్ము సంపాదించవచ్చని ఆశతో ఒడిశా గంజాం జిల్లా బడగోలకు చెందిన ప్రమోద్ వద్ద గంజాయిని కొనుగోలు చేశాడు. దాన్ని గుజరాత్‌లోని సూరత్‌లో ఉంటున్న ఖలియాకు విక్రయించేందుకు ఇచ్ఛాపురం రైలు నిలయానికి వెళ్తుండగా బంగ్లారోడ్‌లో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి చరవాణి, గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో గ్రామీణ ఎస్సై ఇ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన నాయకులు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని ఆమదాలవలసలోని శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో పలువురు కూటమి నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. భువనేశ్వర్‌లోని ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి నెల్లూరుకు వెళ్తున్న సంగతి తెలిసి పలువురు స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో అందరికీ అభివాదం చేసి నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


రైలులో నుంచి నాయకులకు అభివాదం చేస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఉపాధ్యాయ వృత్తిని ఆస్వాదించండి: ఆర్జేడీ



మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు వృత్తిని ఆస్వాదిస్తూ పని చేయాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం అంబేడ్కర్ కళావేదికలో ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, బోధనతో పాటు విద్యార్థుల రక్షణ కూడా ఉపాధ్యాయుల బాధ్యతే అన్నారు. విద్యార్థులను తమ బిడ్డలుగా భావించాలని చెప్పారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ జిల్లాలో పర్యటించి సంతృప్తి వ్యక్తం చేసిన సంగతి గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, విలియమ్స్, పరీక్షల సహాయ కమిషనర్ లియాఖత్ అలీఖాన్ పాల్గొన్నారు.

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

సోంపేట, న్యూస్‌టుడే: నాలుగు రోజుల కిందట పడవ బోల్తా పడి సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు రట్టి అప్పన్న(45) మృతదేహం శనివారం కవిటి మండలం ఒంటూరు సమీపంలో తీరానికి కొట్టుకొచ్చింది. బారువకొత్తూరుకు చెందిన అప్పన్న మరో ముగ్గురితో కలిసి బుధవారం వేటకు వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టినా జాడ కనిపించలేదు. అల్పపీడనం ప్రభావం, సముద్రం లోపల నెలకొన్న పరిస్థితితో ఆలస్యంగా తీరానికి చేరినట్లు గ్రామస్థులు భావిస్తున్నారు. సోంపేట సామాజిక ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహానికి దహన సంస్కారాలు చేశారు. గ్రామస్థులు, మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

డ్రోన్ సాంకేతికతపై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న వీసీ కె.ఆర్.రజని

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ పరిశోధన అభివృద్ధి కేంద్రం, రోసిన్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన ఇన్నోవేటివ్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ (ఐసీడీటీ)తో కలిసి గత అయిదు రోజుల నుంచి డ్రోన్ సాంకేతికతపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. మూడు రోజులు తరగతులు, రెండు రోజులు ప్రయోగాలపై 87 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజని మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులు డ్రోన్ సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకొని తమ భవిష్యత్తుకు ఉపయోగపడేలా మలచుకోవాలన్నారు. శిక్షణలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వర్సిటీ ఆర్అండ్‌డీ డీన్ డా.ఎన్.లోకేశ్వరి, అకడమిక్ అఫైర్స్ డీన్ డా.కె.స్వప్నవాహిణి, ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు సీహెచ్.రాజశేఖరరావు, సహాయ డీన్ డా.ఎన్.మధులత తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


చింతాడ చిన్ని

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయస్థాయి హాకీ పోటీలకు శ్రీకాకుళం నగరం పాత్రునివలసకు చెందిన క్రీడాకారిణి చింతాడ చిన్ని ఎంపికైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి అర్హత సాధించింది. ఈ నెల 30 నుంచి అక్టోబరు 10 వరకు ఝార్ఖండ్‌లోని రాంచీ వేదికగా జరగనున్న జాతీయస్థాయి మహిళల హాకీ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా క్రీడాకారిణిని జిల్లా హాకీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పంచిరెడ్డి అప్పలనాయుడు, జరుగుళ్ల రమేష్, తదితరులు అభినందించారు.

టెన్నీకాయిట్ పోటీలకు పలాస విద్యార్థిని


శ్రావణి పాత్రో

పలాస, న్యూస్‌టుడే: జాతీయస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల టెన్నీకాయిట్ పోటీలకు పలాస ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థిని శ్రావణి పాత్రో ఎంపికైనట్లు ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.జోగారావు, అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు జమ్మూకశ్మీర్‌లో జరగనున్న పోటీల్లో ఆమె పాల్గొంటుందని పేర్కొన్నారు.

షూటింగ్‌'కు అర్హత


వజ్జ ప్రణవి

టెక్కలి, న్యూస్‌టుడే: తిర్లంగికి చెందిన వజ్జ ప్రణవి షూటింగ్‌లో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. కేరళలోని తిరువనంతపురంలో సీబీఎస్ఈ సౌత్‌జోన్ పోటీలు ఈ నెల 25 నుంచి 28 వరకు జరిగాయి. వీటిలో 14 ఏళ్ల వయో విభాగంలో ప్రణవి రజత పతకాన్ని సాధించి, జాతీయస్థాయికి ఎంపికైంది. ఎనిమిదో తరగతి చదువుతున్న క్రీడాకారిణి తండ్రి శ్రీనివాసరావు తిర్లంగి గ్రామానికి చెందిన వారు. ప్రస్తుతం వారు బెంగళూరులో ఉంటున్నారు.

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

సమస్య : ఇచ్ఛాపురం పట్టణం ముత్యాలమ్మపేట సమీప పాత జాతీయరహదారిపై కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డు వెడల్పు తగ్గించడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

-కె.కృష్ణారావు, ఇచ్ఛాపురం

సమాధానం : అక్కడ పరిస్థితిని పరిశీలించి, ఉన్నతాధికారులకు తెలియజేసి, చర్యలు తీసుకుంటాం.

-పి.మోహనరావు, ఏఈ, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బాధిత కుటుంబానికి రూ.1.10 లక్షల సాయం



ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెందిన దల్లి గురుమూర్తి పోలాండ్‌కు వలస కూలీగా వెళ్లి అనారోగ్యంతో ఇటీవల స్వదేశానికి వచ్చి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలాండ్‌లో ఆయనతో పనిచేసిన తోటి వలస కూలీలు, ప్రవాసాంధ్రులు ఆ కుటుంబానికి చేయూతగా నిలిచారు. మొత్తం రూ.1.10లక్షలను శనివారం బాధిత కుటుంబానికి అందించి తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. బోర కృష్ణ, జనపాన సతీష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం



మందస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం (మందస), పలాస గ్రామీణం, వజ్రపుకొత్తూరు, కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం బేతాళపురంలో శనివారం నిర్వహించిన 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బేతాళపురం, రాంపురం, దున్నూరు, బహాడపల్లి పంచాయతీల్లోని కాలనీ ఇళ్ల లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీ ఇళ్లను 2025 మార్చిలోగా పూర్తి చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారి బి.రమణమూర్తి, ఎంపీడీవో తిరుమలరావు, తెదేపా నాయకులు బి.దుర్యోధన, డి.తాతారావు, లింగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు అదే గ్రామంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో పాల్గొని గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. సీడీపీవో వసుంధరాదేవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

గత ప్రభుత్వ హయాంలో మంజూరై వివిధ దశల్లో ఆపేసిన ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని, ప్రతి లబ్ధిదారుడికి వెంటనే బిల్లులు విడుదల చేస్తామని ఎంపీడీవో రమేశ్‌నాయుడు తెలిపారు. పలాస మండలం టెక్కలిపట్నం సచివాలయంలో స్థానిక అధికారులతో సమావేశమయ్యారు. మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, టెక్కలిపట్నం లేఅవుట్ ప్రత్యేకాధికారి శంకర్, హౌసింగ్ ఏఈ వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు. ● వజ్రపుకొత్తూరు మండలంలోని గరుడభద్ర సచివాలయంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలో మంజూరై వివిధ దశలో ఉన్న ఇల్లు నిర్మాణాలను త్వరతిగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ● కంచిలి మండలం మకరాంపురం గ్రామ సచివాలయంలో సర్పంచి ప్రతినిధి తమరాల శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వచ్చే ఏడాది మార్చి నాటికి గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని, ప్రభుత్వ పరంగా సకాలంలో బిల్లులు అందిస్తామని అధికారులు తెలిపారు. ఎంపీడీవో వి.నీరజ, గృహనిర్మాణసంస్థ ఏఈ అప్పారావు పాల్గొన్నారు.

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో అధికారుల మధ్య సమన్వయలోపంతో చేసిన పనుల్లో అభివృద్ధి మాటదేవుడెరుగు.. ఉన్నవాటిని ధ్వంసం చేస్తుండటంతో పట్టణవాసులంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయాల్సిన ముత్యాలమ్మకోనేరు, నెహ్రూ పార్కులో వరదనీరు వదిలే క్రమంలో మురుగునీటిని వదలటంతో కోనేరు కలుషితమై ఇవేం పనులురా అంటూ పలువురు శాపనార్థాలు పెడుతున్నారు. – న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ



నెహ్రూ పార్కులో ధ్వంసమైన దారిలోనే నడుస్తున్న పాదచారులు

ఉద్యానం ధ్వంసం..

ఆహ్లాదమన్నారు.. అధ్వానం చేశారు..

జంటపట్టణాలకు ప్రధానంగా ఆహ్లాదం పంచే ముత్యాలమ్మకోనేరు, నెహ్రూ పార్కులో ఉదయం సాయంత్రం వేళ వందలాది మంది పాదచారులు కాలిబాట కోసం వస్తుంటారు. పురపాలక సంఘంలో ఏళ్లుగా రూ.కోట్లు ఖర్చు చేస్తూ ఉద్యానాన్ని అభివృద్ధి చేస్తూ వచ్చారు. అప్పట్లో పార్కు చుట్టూ ప్రహరీ, కాలిబాట పనులు చేపట్టడంతో ప్రతీరోజు సందర్శకుల తాకిడితో ఆహ్లాదంగా ఉండేది. అభివృద్ధి పేరిట ఉన్న వాటిని ధ్వంసం చేసి కొత్తగా ప్రహరీగోడ నిర్మించి దాన్ని సగంలోనే ఆపేయడంతో ఆ ప్రాంతం రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారైంది. పార్కు చుట్టూ పర్యవేక్షణ ఉండేలా ఏర్పాట్లు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మురుగునీరుతో దుర్వాసన..

ముత్యాలమ్మకోనేరులో నీటి సామర్థ్యం లేకపోవటంతో ఇటీవల కురిసిన వర్షం నీటిని చెరువులోకి మళ్లించేందుకు అధికారులు పనులు చేపట్టారు. పొక్లెన్‌తో పెద్దపెద్దగా గుంతలు తవ్వటంతో ఆ ప్రాంతంలో నిర్మాణం చేసిన కాలిబాట ధ్వంసమైంది. వరదనీరు బదులుగా జంటపట్టణాలకు చెందిన మురుగునీరు చేరటంతో చెరువు నల్లగా మారి కలుషితంగా తయారైంది. చెరువులోకి జంటపట్టణాల్లోని ప్లాస్టిక్ డబ్బాలు, చెత్త చేరుతుండటంతో దుర్వాసన వస్తోందని పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళ పార్కులో చీకటి పడితే మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు, దీపాలు సైతం లేకపోవటంతో ఆ ప్రాంతం నిర్మానుష్యంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కాలిబాట మరమ్మతులు, చెరువులో మురుగునీటిని తొలగించాలని కోరుతున్నారు.

పరిశీలిస్తాం..

ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నా. ముత్యాలమ్మ కోనేరు, నెహ్రూపార్కులను అధికారులతో వచ్చి పరిశీలిస్తా. కాలిబాట ధ్వంసం చేసిన వారితో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– ఎన్.రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం



మురుగునీటితో కలుషితమైన ముత్యాలమ్మకోనేరు

సంగీత గురువు జన్మదిన వేడుకలు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : ఉద్దాన శాస్త్రీయ సంగీత గురువు దివంగత బోర జగన్నాథరావు జన్మదిన వేడుకలను కవిటి మండలం గొండ్యాలపుట్టుగలో బీజేఎన్ సంగీత కళాశాల వ్యవస్థాపకుడు రెల్ల జోగారావు ఆధ్వర్యంలో శిష్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వర నీరాజనం సంగీత భజన కార్యక్రమం నిర్వహించారు. శిష్యులు పండి దేవేంద్రమూర్తి, తిరుపతిరావు, ప్రియ నర్సింగరావు, లోళ్ల రాంబాబు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సంగీత కళాకారులు

వజ్జ బాబూరావుకు శుభాకాంక్షలు

పలాస, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన వజ్జ బాబూరావుకు ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్దఎత్తున అభిమానులు తరలివస్తున్నారు. సాయిశిరీష హైస్కూల్ కరస్పాండెంట్ కవిటి భారతి, రేణుకేశ్వరరావు శనివారం మొక్క శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, కార్యదర్శి ఎస్.నవీన్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు, తదితరులు ఆయన్ను అభినందించారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



గర్భిణులకు చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్, దాసరి రాజు

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు, చిన్నారులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే బెందాళం అశోక్, నియోజకవర్గ జనసేన బాధ్యుడు దాసరి రాజు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం సీడీపీవో కె.నాగరాణి అధ్యక్షతన పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో గర్భిణులు, బాలింతలకు చీరలు అందించారు. ఎంపీపీ బోర పుష్ప, సూపర్‌వైజర్లు ఎన్.నీలవేణి, బి.సుజాత, పుష్ప పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న ప్రమాదం..

ఇచ్ఛాపురం పురపాలకసంఘ పరిధిలోని రత్తకన్న క్వారీరోడ్డు సమీపంలో విద్యుత్తు తీగలకు పనికిరాని మొక్కల పొదలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాలకు విద్యుదాఘాతం జరిగి ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని, ప్రమాదాన్ని నివారిస్తామని విద్యుత్తు ఉపకేంద్ర ఏఈ గోవిందరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



శుద్ధ జలం అందించండయ్యా..



గత తెదేపా ప్రభుత్వ హయాంలో కంచిలి మండలంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల శుద్ధ జల కేంద్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు. వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో క్రమంగా ఈ కేంద్రాలు మూలకు చేరాయి. కిడ్నీ బాధితులు పెరుగుతుండటంతో శుద్ధజలం వాడకం పెరిగింది. అధికారులు స్పందించి శుద్ధమైన నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్.డబ్ల్యూ.ఎస్ జేఈ మోహన్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే శుద్ధ జల కేంద్రాలను వినియోగంలోకి తెస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం


పెచ్చులూడి.. భద్రత కొరవడి!

వజ్రపుకొత్తూరు మండల తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు నుంచి పెచ్చులూడుతున్నాయి. గోడలు బీటలువారి ప్రమాదకరంగా తయారయ్యాయి. గది తలుపులు, కిటికీలకు చెదలు పడుతున్నాయి. కంప్యూటర్లు, దస్త్రాలకు భద్రత లేకుండా పోయే పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగులు వాపోతున్నారు. నూతన భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ పి.బాల తెలిపారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



అధ్వాన దారి



ఇచ్ఛాపురం 15వ వార్డు పరిధి సంతపేట వద్ద ఉన్న కాలనీలో సగం వరకే సీసీ రోడ్డు నిర్మించి వదిలేయటంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పాత జాతీయరహదారిని కలుపుతూ.. నివాస ప్రాంతాలు ఉన్న వరకూ రోడ్డును పొడిగించాలని కోరుతున్నారు. చిన్నపాటి వర్షానికే నడవటానికి సైతం వీలు లేకుండా పోతుందని వాపోతున్నారు. నిధులు, ప్రతిపాదనల మేరకు ఈ సమస్యను పరిష్కరిస్తామని ఏఈ కామేశ్వరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీకాకుళం ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో కవిటికి చెందిన **తరుణ్ బెహరా** అండర్-17 విభాగంలో బ్యాడ్మింటన్ వ్యక్తిగత క్రీడాకారుడుగా రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో ఉషోదయ యువజన సంఘం, బ్యాడ్మింటన్ అసోసియేషన్, కవిటి గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాఢి

కంచిలి, న్యూస్‌టుడే : మండలంలోని నువాగడ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాఢి తెలియజేశారు. శనివారం జరిగిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన హేమంత్ సబరో, రుణా సబరో, కుజాం రోహిత్, సంతోష్ మండల్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ఉన్నత భవితకు ఇంటర్మీడియట్ కీలకం



ఇచ్ఛాపురం: కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న డీవీఈవో తవిటినాయుడు

ఇచ్ఛాపురం, కంచిలి, న్యూస్‌టుడే: లక్ష్యాన్ని సాధించేందుకు, ఉన్నతంగా ఎదిగేందుకు ఇంటర్మీడియట్ విద్య ఎంతగానో తోడ్పడుతుందని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి (డీవీఈవో) ఎస్.తవిటినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపల్ వి.శంకరరావు, ఇతర అధ్యాపకులకు సూచించారు. స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ● కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీవీఈవో తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించి, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. గతంలో మంజూరైన కళాశాల అదనపు భవనాల పనులు నిలిచిపోవడంతో తరగతి గదుల సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రిన్సిపల్ జగదీశ్వరరావు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

విజేతలకు ప్రశంసలు



విశాఖపట్నం భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో సమితి స్థాయిలో జ్ఞాన, విజ్ఞాన మేళా, సంస్కృతి మహోత్సవ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కవిటికి చెందిన బల్లెడ శ్రీదీక్షిత, బి.లయ, కె.చైతన్య, ఎస్.యశ్వంత్ నారాయణ, బాల వర, లండ యోగేష్‌లు వివిధ పోటీల్లో గెలుపొందారు. విజేతలను శనివారం పాఠశాల కరస్పాండెంట్ బల్లెడ కృష్ణారావు తదితరులు అభినందించారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



పలాస గ్రామీణం: ఇన్నీసుపేటలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కవిటి గ్రామీణం: పెద్ద ఎర్రగోవిందపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో..

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్‌ను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు పాఠశాల, కళాశాలలో శనివారం భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు ఆయన చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళలర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తుచేశారు. –న్యూస్‌టుడే బృందం



ఇచ్ఛాపురం గ్రామీణం: భగత్‌సింగ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల నివాళి

ఆలయాల్లో స్వచ్ఛతా హీ సేవ

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణ పారిశుద్ధ్య అధికారి పి.ఉపేంద్రకుమార్ ఆధ్వర్యంలో శనివారం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం వద్ద పాతాళహరసిద్ధేశ్వరాలయం, బెల్లుపడ త్రినాథ మందిరం ప్రాంగణాలను పరిశుభ్రపరిచారు. స్వచ్ఛపట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపేంద్ర కుమార్ పిలుపునిచ్చారు.



స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం వద్ద పరిశుభ్రత పనులు

పోటీతత్వం అవసరం

కవిటి, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే : విద్యార్థుల మధ్య పోటీతత్వం ఉన్నప్పుడే ఉన్నతంగా రాణించగలుగుతారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.రాజేశ్వరరావు అన్నారు. శనివారం ప్రభుత్వ ఆదేశాలు మేరకు కళాశాలలో స్వర్ణాంధ్ర-2047పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ● ఇచ్ఛాపురం పట్టణంలోని శాంతినికేతన్ విద్యాలయంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు డి.కృష్ణమూర్తిరెడ్డి, మేనేజర్ కేసీ పూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ● స్వర్ణభారతి విద్యాలయంలో నిర్వహించిన ఎల్లోడే కార్యక్రమం ఆకట్టుకుంది. ప్లేస్కూల్ విద్యార్థులకు రంగులపై అవగాహన కలిగేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని సంస్థ అధ్యక్షుడు తులసీదాస్, కార్యక్రమబాధ్యురాలు గుణవతి తెలిపారు.

అవీ..ఇవీ..అన్నీ

జిల్లేడు ద్రావణంతో పంటకు పోషకాలు



కంచిలి, న్యూస్‌టుడే : మన ఇళ్ల చుట్టూ పెరిగే జిల్లేడు ఆకుల నుంచి తయారు చేసిన ద్రావణంతో పంటలకు పోషకాలు తయారు చేయవచ్చని ప్రకృతి వ్యవసాయ అదనపు డీపీఎం ధనుంజయరావు అన్నారు. కంచిలి మండలం పెద్దపాత్రపడ గ్రామంలో శనివారం జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు అవగాహన కల్పించి వారితో తయారుచేయించారు. ఎన్ఎఫ్ఏ బాబాజీ, ఎంఏ శివానందం, ఎల్‌టూ కామరాజు, ఐసీఆర్పీలు, మహిళా రైతులు, రైతులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణంపై అసంతృప్తి

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాతటెక్కలి పంచాయతీలో పలు చోట్ల నిర్మిస్తున్న మురుగు కాలువ నిర్మాణంలో నాణ్యతాలోపం కన్పిస్తుందంటూ స్థానిక మాజీ సర్పంచి, ఎంపీటీసీ సభ్యుడు పిరియా శివప్రసాద్, గిరి, గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌పీరోడ్డు నుంచి యూఆర్‌కే పురం వెళ్లే రహదారి మార్గం పాతటెక్కలి వద్ద నిర్మించిన డ్రైనేజీపై పలు చోట్ల రైతుల పొలాలు, తోటలకు వెళ్లే మార్గంలో కాంక్రీటు స్లాబు వేశారు. పర్యవేక్షణ లేని కారణంగానే ఇలాంటి నాసిరకం నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై స్థానిక సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ వద్ద 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పనుల్లో నాణ్యత ఎక్కడ లోపించినా బిల్లులు చెల్లించేది లేదన్నారు. మరోసారి పనుల పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

శరన్నవరాత్రుల శుభరాట

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: వచ్చే నెల 3 నుంచి ప్రారంభంకానున్న దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకోసం మండలంలో పెద్దశ్రీరాంపురంలో గ్రామస్థులు శనివారం పండితుల ఆధ్వర్యంలో శుభరాట వేశారు. పూజాకార్యక్రమంలో మహిళలు, యువత పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

సోంపేట, న్యూస్‌టుడే: రుషికుద్దలో కర్రి నారాయణస్వామి 50వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కర్రి కామేశ్వరరావు, ఎంపీపీ డాక్టర్ ఎన్.దాసు, నారాయణస్వామి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత



మందస మండలం అంబుగాంకు చెందిన కుప్పిలి తరినమ్మ ఇటీవల పాముకాటుకు గురైంది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం కొద్ది రోజులు పనుల్లోకి వెళ్లకుండా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆమెకు శనివారం పవనపుత్ర సేవా సంఘం సభ్యులు రూ.10 వేలు సాయం అందజేశారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అసత్యప్రచారంతో భక్తుల్లో అపోహలు

పలాస, కంచిలి, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమల లడ్డూపై అసత్యప్రచారంతో భక్తుల్లో అపోహలు సృష్టిస్తున్నారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పాప ప్రక్షాళన పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త డోకి రామారావు, వైస్‌ఛైర్మన్ బి.కృష్ణారావు, మందస ఎంపీపీ డి.దానయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ❖ కంచిలిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎంపీపీ దేవదాసురెడ్డి, నాయకులు, సామూహిక పూజలు నిర్వహించారు. ❖ ఇచ్ఛాపురం పట్టణం గిలాయివీధిలోని వైభవ వేంకటేశ్వరాలయంలో పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రకాశరావు, నాయకులు పూజలు నిర్వహించారు.



పలాస: వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మాజీ మంత్రి అప్పలరాజు, వైకాపా నాయకులు

వర్మీ తయారు చేయాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఐవీ రమణ

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలోనూ వర్మీ కంపోస్టు కచ్చితంగా తయారు చేసి, తద్వారా ఆదాయం సృష్టించాలని డీఎల్‌పీవో ఐవీ రమణ చెప్పారు. పలాస మండలం బొడ్డపాడులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావుతో కలిసి ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఆవరణలో మొక్కలను నాటారు. పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి, సర్పంచి తామాడ మదన్ పాల్గొన్నారు. ● మామిడిపల్లిలో శిథిలావస్థకు చేరుకున్న తాగునీటి ట్యాంక్ మెట్లను డీఎల్‌పీవో ఐవీ రమణ పరిశీలించారు. సోమవారానికి కొత్త మెట్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శి మీనాకుమారిని డీఎల్‌పీవో ఆదేశించారు. మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, సర్పంచ్ మదన్, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
9441426248
8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? దేవుపురం కూడలి నుంచి దేవుపురం, పాలవలస పేట మీదుగా బోరుభద్ర బీటీ రహదారి వరకు 1.5 కి.మీ. మార్గంలో కంకర వేసి వదిలేశారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- కామరాజు, దేవుపురం**

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, బీటీ రహదారి నిర్మిస్తాం. **- మోహన్, ఏఈ, పీఐయూ**

- న్యూస్‌టుడే, నందిగాం

? బుడితి ఉన్నత పాఠశాల సూచిక బోర్డు ప్రధాన రహదారి వద్ద వ్యతిరేక దిశలో ఉండటంతో కొత్తగా వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. చర్యలు తీసుకోవాలి. **- విద్యార్థుల తల్లిదండ్రులు**

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, బోర్డును సరిచేసేందుకు కృషి చేస్తాం. **- ఎం.భీమరాజు, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు**

- న్యూస్‌టుడే, సారవకోట

? అల్లాడ గ్రామానికి 3 రోజులుగా శ్రీముఖలింగం తాగునీటి ప్రాజెక్టు ద్వారా తాగునీరు సరఫరా అవడం లేదు. అధికారులు స్పందించాలి. **- మహేశ్వరరావు, స్థానికుడు**

● తాగునీటి ప్రాజెక్టు విద్యుత్తు నియంత్రిక మరమ్మతులకు గురైంది. కొత్తది అమర్చి, ప్రజలు ఇబ్బందులు తీరుస్తాం . **- చైతన్య, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

- న్యూస్‌టుడే, జలుమూరు

జిల్లా ఆసుపత్రిలో పనులు



రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. శనివారం ఆసుపత్రికి ఈశాన్యం వైపు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కూడా ఈశాన్యం వైపు ప్రహరీని తొలగించారు. - న్యూస్‌టుడే, టెక్కలి

భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ



సిబ్బందికి సూచనలిస్తున్న టెక్కలి ఆర్డీవో సుదర్శన్‌దొర

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: వచ్చేనెల 1 నుంచి జరగనున్న కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతరమహోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టెక్కలి ఆర్డీవో సుదర్శన్‌దొర సూచించారు. శనివారం కొత్తమ్మతల్లి ఆలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఆర్డీవో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణీంద్ర కుమార్, తహసీల్దార్ అప్పలరాజు, డీఎల్‌పీవో రమణ, కోటబొమ్మాళి ఈవో చింతాడ సన్యాసి, ఏఈ సురేష్, తెదేపా మండల అధ్యక్షుడు బోయిన రమేష్, ఈవో రాధాకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పారాపురంలో చోరీ

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పారాపురం గ్రామంలో జరిగిన చోరీకి సంబంధించి శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అహ్మద్ తెలిపారు. గ్రామంలో శుక్రవారం రాత్రి డి.రాము, వై.రవికుమార్‌లకు చెందిన ఐదు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఏవోగా మల్లేశ్వరమ్మ

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్‌ఎన్‌పేట మండల పరిషత్తు కార్యాలయం ఏవోగా జి.మల్లేశ్వరమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. జడ్పీ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఈమె ఇక్కడకు వచ్చారు.

ఇకనైనా.. వికసించేనా..?

న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

ప్రపంచస్థాయి ప్రమాణాలతో షటిల్ బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులు, జిమ్, క్రీడాకారుల విశ్రాంతికి పెవిలియన్ భవనం.. ఇలా నైపుణ్యాల అభివృద్ధికి అత్యాధునిక వసతులతో గతంలో తెదేపా హయాంలో టెక్కలిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రం ఆటగాళ్లలో కోటి ఆశలు రేకెత్తించింది. అయితే గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం వాటిని మరుగున పడేసింది. పే అండ్ ప్లే విధానం తీసుకొచ్చి క్రీడావికాస కేంద్రాల ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని ప్రయత్నించి ఆటగాళ్లకు మైదానాన్ని, వసతులను దూరం చేసింది. శిక్షకులను నియమించినా వారంతా వెనక్కి వెళ్లిపోవడంతో ప్రతిభావంతులైన క్రీడాకారులకు దిశానిర్దేశం చేసే వారే కరవయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మౌలిక వసతుల అభివృద్ధికి మోక్షం కలుగుతుందని సర్వత్రా ఆకాంక్షిస్తున్నారు.



పనికిరాని మొక్కలతో అధ్వానంగా ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రం మైదానం

నిర్వహణ లోపంతో నిర్వీర్యం

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.2.10 కోట్లతో నిర్మించిన ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రాన్ని 2019 జనవరిలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం, పెవిలియన్ భవనం పూర్తవగా, మైదానంలో కొంతమేర అభివృద్ధి పనులు జరగాల్సి ఉంది. 2019 ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారాక పూర్తిగా వీటిని మరుగున పడేశారు. పరికరాలు పాడవటంతో వ్యాయామశాలకు తాళాలు వేసేయగా, క్రీడా సామగ్రి మూలకు చేరింది. ఆకతాయిలు మరుగుదొడ్లు ధ్వంసం చేశారు.



ఇండోర్ స్టేడియంలో మరుగుదొడ్ల పరిస్థితి

శిక్షకుల్లేక.. మైదానం సరి లేక

క్రీడావికాస కేంద్రంలో గతంలో కబడ్డీ, హ్యాండ్‌బాల్ శిక్షకులు ఉండేవారు. వారు బదిలీపై వెళ్లిపోవడంతో క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చే వారే కరవయ్యారు. ప్రస్తుతం పే అండ్ ప్లే ప్రాతిపదికన తైక్వాండో శిక్షకుడిని నియమించారు. ఆర్థిక స్థోమత లేని క్రీడాకారులు స్టేడియానికి రావడం లేదు. మరోవైపు గత ఐదేళ్లలో మైదానంలో ఎలాంటి పనులు జరగలేదు. 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్, కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ కోర్టులు నేటికీ నిర్మించలేదు. అప్పుడప్పుడు జిల్లా అధికారులు పరిశీలనకు వస్తున్నా నిధుల్లేవంటూ చేతులెత్తేయడంతో క్రీడాకారులు నష్టపోతున్నారు. మైదానానికి రక్షణ గోడ లేకపోవడంతో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. ఇండోర్ స్టేడియంలో షటిల్ కోర్టు పైభాగంలో రంధ్రం ఏర్పడటంతో వర్షం నీరు లోపలకు వస్తోందని ఆటగాళ్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి సమస్యలు

టెక్కలిలో ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం పే అండ్ ప్లే విధానంలో ఓ శిక్షకుడు పనిచేస్తున్నారు. ఒక వాచ్‌మెన్, ఒక అటెండరును నియమించాం. నిధుల సమస్య వెంటాడుతోంది. ప్రభుత్వం శిక్షకులను నియమిస్తే క్రీడా సామగ్రి సరఫరా జరుగుతుంది.

- కల్లేపల్లి శ్రీధర్, డీఎస్‌డీవో, శ్రీకాకుళం

ఎట్టకేలకు వీడిన గ్రహణం

స్పందనకు వందనం



కోటబొమ్మాళి కేజీబీవీలో అదనపు తరగతుల భవనాలకు అయిదేళ్లకు మోక్షం లభిస్తోంది. బాలికల వసతి ఇబ్బందులు తీర్చేందుకు 2019 జులైలో రూ.1.10 కోట్ల నాబార్డు నిధులతో పనులు ప్రారంభించారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో నిర్మాణం చివరి దశలో నిలిచిపోయింది. దీనిపై ఈనాడులో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. భవన నిర్మాణాలు మరికొద్ది రోజుల్లో పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఏఈ రామానందం పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

పచ్చటి నిర్లక్ష్యం..!

కొత్తూరు మండలం లబ్బ గ్రామంలోని తామాడ చెరువులో పూడిక పేరుకుపోయింది. పనికిరాని మొక్కలు, నాచు పెరిగిపోవడంతో కాసారం మైదానంలా పచ్చగా తయారైంది. వర్షాకాలంలో దీని నుంచే సమీపంలోని పొలాలకు సాగునీరు అందుతుంది. పరిస్థితి ఇలా మారడంతో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేకుండా పోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై నీటిపారుదల శాఖ ఏఈ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చెరువును శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కొత్తూరు



ఎన్నాళ్లీ నరకయాతన..?



సారవకోట మండలం వడ్డిన వలస- కొమనాపల్లి రోడ్డు నుంచి తర్లి వరకు రహదారి నిర్మాణానికి 2018లో ఎమ్మెల్యే రమణమూర్తి శంకుస్థాపన చేశారు. కొంత మేర పనులు జరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని పట్టించుకోకపోవడంతో అయిదేళ్లుగా రాకపోకలకు నరకయాతన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షాలకు గోతుల్లో నీరు చేరి తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని పీఐయూ విభాగం ఏఈ కోదండరావు చెప్పారు.

- న్యూస్‌టుడే, సారవకోట

ఏడాదిగా పిల్లర్ల స్థాయిలోనే

నరసన్నపేట మండలం చిక్కాలవలసలో రైతు సేవా కేంద్రం నిర్మాణాన్ని పిల్లర్ల స్థాయిలోనే ఏడాదిగా వదిలేశారని గ్రామస్థులు వాపోతున్నారు. మండలంలో అన్నిచోట్ల నిర్మాణాలు పూర్తి చేసినా తమ గ్రామంలోని భవనాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ సత్యంనాయుడు దృష్టికి తీసుకెళ్లగా.. నిధులు అందుబాటులోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం



నిర్మాణాలు వేగవంతం చేయాలి



పాతపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, నరసన్నపేట, జలుమూరు, మెళియాపుట్టి, కొత్తూరు, న్యూస్‌టుడే: వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల సమావేశాలు నిర్వహించి, లబ్ధిదారుల అభిప్రాయాలు సేకరించారు. నిర్మాణాలు పూర్తి చేయకుంటే రద్దు అయ్యే అవకాశం ఉందని సూచించారు. సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వంతెన పనులు త్వరలో ప్రారంభిస్తాం



గారలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి

గార, న్యూస్‌టుడే: గార, వనిత మండలం గ్రామాల మధ్య నిర్మిస్తున్న వంతెన పనులు త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం వంతెన వద్ద వారు పరిశీలన చేశారు. తొలగించాల్సిన ప్రభుత్వ కార్యాలయ భవనాలకు వేరే చోట వసతి కల్పించేందుకు సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. 2017లోనే వంతెన పనులు ఏడాది కాలంలో 64శాతం పూర్తై భూసేకరణ జరిగినప్పటికీ గత ప్రభుత్వంలో ఎటువంటి పురోగతి లేదన్నారు. వైకాపా హయాంలో మంత్రులుగా చేసిన ధర్మాన సోదరులు పనులను పూర్తిగా విస్మరించారని ఎద్దేవా చేశారు. తెదేపా నాయకులు వెంకటప్పారావు, వెంకటరమణ, భాస్కరరావు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన న్యాయమూర్తి



సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని కేజీబీవీ, సమీకృత వసతిగృహం, తర్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, సవరబొంతు గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలను పాతపట్నం సివిల్ జడ్జి ఎం.రోషిణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు పరిశీలించారు. ఉపాధ్యాయులు, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

సారవకోట కేజీబీవీలో తనిఖీలు నిర్వహిస్తున్న పాతపట్నం సివిల్ జడ్జి రోషిణి

బుడితి ఆసుపత్రి ఆవరణలో పనులు

సారవకోట, న్యూస్‌టుడే: బుడితి ఆసుపత్రి ఆవరణలో ఎట్టకేలకు పనులు ప్రారంభించారు. పరిసరాల్లో పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతో పాముల బెడద పెరిగిపోయింది. ఇటీవల ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి స్థానికులు సమస్యలను తెలియజేశారు. స్పందించిన ఆయన ఈ విషయమై స్థానిక సర్పంచి పొన్నాన శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు మెండ మురళీకృష్ణ మాట్లాడారు. పంచాయతీ నిధులతో పనులు చేయించాలని కార్యదర్శి డి.శ్రీనివాసరావుకు సూచించారు. ఈ మేరకు ప్రస్తుతం పనికిరాని మొక్కలు తొలగిస్తున్నారు.

పనికిరాని మొక్కల తొలగింపు

స్పందనకు వందనం

హిరమండలం, న్యూస్‌టుడే: గొట్టాబ్యారేజీ నుంచి శ్రీముఖలింగం వెళ్లే రహదారిలో మలుపుల వద్ద భగీరథపురం సమీపంలో పనికిరాని మొక్కలను ఉపాధి వేతనదారులు తొలగిస్తున్నారు. ఇటీవల రహదారి మలుపుల వద్ద పొదలు, మొక్కలు పెరిగిపోవడంపై ఈనాడులో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే గోవిందరావు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులు చేపట్టడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాజగోపురానికి కలశాల సొబగులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి ఆలయంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన రాజగోపురంపై శనివారం కలశాలు ఏర్పాటు చేశారు. రాజగోపురంపై గతేడాది పిడుగు పడటంతో పనులు చేపట్టలేదు. దీనిపై రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీయడంతో ఇటీవల త్వరితగతిన పనులు జరిపారు. తణుకు సమీపంలోని అజ్జవరంలో తయారు చేయించిన కలశాలను అమర్చారు.



రోడ్డుప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై అక్కవరం వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో పరశురాంపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవరు గువ్వాడ రాజేష్‌కు గాయాలయ్యాయి. టెక్కలి నుంచి స్వగ్రామం ఆటోపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని లారీ ఢీకొని వెళ్లిపోవడంతో ఆటో పల్టీలు కొట్టింది. ప్రమాదంలో ఆయన చేతికి బలమైన గాయం కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

న్యాయమూర్తులకు ఆహ్వానం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: వచ్చేనెల 1 నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాలకు నరసన్నపేట, కోటబొమ్మాళి న్యాయమూర్తులకు శనివారం ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. జూనియర్ సివిల్‌జడ్జిలు సీహెచ్.హరిప్రియ, బీఎంఆర్ ప్రసన్నలతకు ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణ ఆహ్వానపత్రికలు అందచేశారు.

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాలను వమ్ముచేయకుండా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తంగుడు సంతోషి సూచించారు. కళాశాల స్వాగతోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ద్విచక్ర వాహనాలు ఢీ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జర్జంగి- జలుమూరు రహదారిలో శనివారం రెండు ద్విచక్రవాహనాల ఢీకొన్న ఘటనలో అయిదుగురు గాయపడ్డారు. వీరిలో కోరాడ నారాయణరావు అనే వ్యక్తికి తలకు బలమైన గాయం కావడంతో శ్రీకాకుళం తరలించినట్లు కోటబొమ్మాళి ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. ఘటనలో మహేష్‌కుమార్, రాకేష్‌లతో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు వివరించారు. ● జాతీయరహదారిపై కొత్తపేట వద్ద ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం కోటబొమ్మాళి తరలించినట్లు 108 సిబ్బంది వివరించారు.

సంపద తయారీ కేంద్రం ప్రారంభం

పోలాకి, న్యూస్‌టుడే: తలసముద్రం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి ఆర్.మురళీధర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో సూర్యప్రకాష్, మాజీ సర్పంచి సూరిబాబు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక బాటలో సాగుతున్నారు..!

నరసన్నపేట నియోజకవర్గంలో కొందరు ఆధ్యాత్మికత బాటలో నడుస్తూ శేష జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. లక్షలాది రూపాయలు సొంత నిధులు వెచ్చించి గ్రామాల్లో ఆలయాలు నిర్మించి పది మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, జలుమూరు, పోలాకి



గొటివాడలో సంజీవ్ దంపతులు ఏర్పాటు చేసిన సత్యనారాయణస్వామి గుడి

గ్రామాల్లో సొంత నిధులతో ఆలయాల నిర్మాణం



ముద్దాడపేటలో సూర్యనారాయణ నిర్మించిన ఎండల మల్లేశ్వరాలయం

ముద్దాడపేటలో విశ్రాంత ఉద్యోగి

నరసన్నపేట మండలం ముద్దాడపేట గ్రామానికి చెందిన ధర్మాన సూర్యనారాయణ విశ్రాంత రైల్వే ఉద్యోగి. పదవీ విరమణ అనంతరం నిరాదరణకు గురైన ఎండల మల్లేశ్వర ఆలయ పునరుద్ధరణకు నడుం బిగించారు. సమీపంలోని మొయ్యవానిపేట గ్రామ రైతు వద్ద కొంత స్థలాన్ని వితరణగా అందుకొని రూ.2 లక్షలకు పైగా తన సొంత నిధులతో 2008లో ఆలయం నిర్మించారు. గుడి ఆవరణలో బావి నిర్మించడంతో పాటు విద్యుత్తు సౌకర్యం కల్పించి అర్చకుడిని ఏర్పాటు చేసి ఆయనకు ఉపాధి కల్పించారు. కోమర్తి గ్రామానికి చెందిన ఉంగటి రాజుతో కలసి పోలాకి కాలువపై వంతెన ఏర్పాటు చేసి, ఇటీవల దానిపై రూ.30 వేలు నిధులు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మించారు. ఆలయంలో వినాయక, పార్వతీ, సుబ్రహ్మణ్యస్వామి, నందీశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామంలోని విద్యార్థుల సౌకర్యార్థం బల్లలు, నోటు పుస్తకాలు, పెన్నులు సమకూర్చి దాతృత్వం చాటుకున్నారు.

కోటి రూపాయిలతో..

జలుమూరు మండలంలోని గొటివాడ గ్రామానికి చెందిన సోమినేని సంజీవ్, సింహాచలం దంపతులు సొంత ఆస్తిని విక్రయించి సత్యనారాయణస్వామి ఆలయాన్ని సుమారు కోటి రూపాయలతో నిర్మించారు. ముఖ్యమైన పర్వదినాలు, భీష్మ, కార్తిక ఏకాదశి రోజుల్లో వ్రతాలు నిర్వహిస్తున్నారు. 'ఇష్ట దైవమైన సత్యనారాయణ స్వామి వ్రతం చేసేందుకు ఏటా బొడ్డపాడులో జరిగే ఉత్సవాలకు వెళ్లే వాళ్లమని, సంతానం లేదని, అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా స్వామి కలలో కనిపించడంతో ఆలయ నిర్మాణం చేపట్టామని' సంజీవ్, సింహాచలం దంపతులు చెబుతున్నారు.

ఎకరా పొలం కొనుగోలు చేసి

పోలాకి మండలం కిల్లిబుచ్చెన్నపేట గ్రామానికి చెందిన కె.తిరుమల తేజ సుమారు 12 లక్షల రూపాయిల సొంత నిధులు వినియోగించి ఎకరం పొలం కొనుగోలు చేశారు. దానిలో ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసి, 2008లో చినజీయర్‌స్వామి చేతుల మీదుగా వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గుడి నిర్మాణంతో గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

పోటీతత్వం అలవరుచుకోవాలి

జలుమూరు, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవరుచుకోవాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు అన్నారు. 'స్వర్ణాంధ్ర 2047' కార్యక్రమం పేరుతో జలుమూరు బాలికోన్నత పాఠశాలలో మండలస్థాయిలో 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు శనివారం పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం వేణుగోపాలరావు పాల్గొన్నారు. ● టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఆర్.రష్మిక సంతోషి, వ్యాసరచనలో కె.జాహ్నవి ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు విజేతలను అభినందించారు.

ఆర్థిక సహాయం అందజేత

హిరమండలం, న్యూస్‌టుడే: పిండ్రువాడ గ్రామానికి చెందిన కింజరాపు శంకర్ అనే యువకుడు కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో కొత్తూరుకు చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు శనివారం ట్రస్టు సభ్యులు శంకర్ కుటుంబ సభ్యులకు నగదు ఇచ్చారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

పాతపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజి అన్నారు. శనివారం ప్రహరాజపాలెంలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయనఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రిన్సిపల్ వి.అర్చన, కొల్లివలస ప్రిన్సిపల్ డి.దేవేంద్రరావు ఉన్నారు.

భగత్‌సింగ్ చిరస్మరణీయుడు



పాతపట్నం ప్రభుత్వ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాతపట్నం, టెక్కలి పట్టణం, మెళియాపుట్టి, నరసన్నపేట, న్యూస్‌టుడే: స్వతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ చిరస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. శనివారం ఆయన జయంతి కార్యక్రమాన్ని పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమాజ హితమే జాషువా అభిమతం

పాతపట్నం, సంతబొమ్మాళి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: సమాజ హితమే జాషువా అభిమతమని పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీరాములు అన్నారు. శనివారం కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో రచయిత ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ కె.చక్రపతి పాల్గొన్నారు. ● సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా జయంతి వేడుకలు తెలుగు ఉపాధ్యాయులు రాము, మురళీధరరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ● టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడు ఎస్.ఢిల్లేశ్వరరావు, ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపల్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో ఆధార్ సేవలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : టెక్కలి ప్రధాన తపాలాశాఖ కార్యాలయంలో ఈనెల 30వ తేదీనుంచి ఆధార్‌కార్డులో మార్పులు, కొత్త ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పోస్టుమాస్టర్ ఎన్.తిరుపతిరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి కేంద్రం పనిచేస్తుందని, పరిసర ప్రాంతాల ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

భగత్‌సింగ్‌కు నివాళి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరంలో శనివారం భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహదాతలు నేమాని వేదవతి దేవీ, శ్యాంప్రసాద్ కుటుంబసభ్యులు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళాడిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. సూర్యచంద్రరావు, మందిర కమిటీ ప్రతినిధులు డా. జామి. భీమశంకర్, సురంగి మోహనరావు, ఎంవీఎస్ఎస్ శాస్త్రి, కొంక్యాణ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

● కీర్తన: సరిపోదా శనివారం ● కీర్తిక: దేవర ● కిన్నెర సినీమాక్స్: సత్యం సుందరం ● ఎస్వీసీ (రామలక్ష్మణ): దేవర ● సూర్యమహల్: దేవర ● సరస్వతి: దేవర ● చంద్రమహల్: మత్తు వదలరా-2 ● మారుతి: దేవర

– న్యూస్‌టుడే, అరసవల్లి

కల్యాణం.. కమనీయం



భాద్రపద బహుళ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం అరసవల్లి సూర్యనారాయణస్వామి కల్యాణం నిర్వహించారు. అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉషా, ఛాయ, పద్మినీ సమేత సూర్యనారాయణస్వామి వారికి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో అర్చకుడు ఇప్పిలి సాందీపశర్మ, భక్తులు, పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి

గార, కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో సదుపాయాలు కల్పించి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గార మండలం అంపోలు పంచాయతీ లింగాలవలస సమీపంలో వద్ద జగనన్న కాలనీ, అర్బన్ లే అవుట్లను శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి లబ్ధిదారు ఇల్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఆయన వెంట ప్రత్యేకాధికారి, ఎంపీడీవో పీడీ శాంతిశ్రీ, తహసీల్దారు ఎస్.రమణారావు, సిబ్బంది ఉన్నారు. ★ మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం గ్రామీణ మండలం వాకలవలసలోని జగనన్న కాలనీని ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. కాలనీలో కనీస వసతులు కల్పించకుండా గాలికొదిలేశారని వైకాపా తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మార్చిలోగా ఇళ్ల బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



లింగాలవలస కాలనీ వద్ద లబ్ధిదారులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హమాలీల ఎగుమతి కూలీ ధర పెంచాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ హమాలీలకు ఎగుమతి కూలీ ధర రూ.9లకు పెంచాలని హమాలీస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కొండలరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలోని ఐఎంఎల్ డిపోలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం హమాలీలతో సమావేశం నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలియజేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, హమాలీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.బంగార్రాజు, స్థానిక నాయకులు బి. రాము, ఎన్.రమణ, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశ్రమ వ్యర్థాలపై అవగాహన

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని అరిణాం అక్కివలస పంచాయతీలోని స్థానిక నాగార్జున అగ్రికెం పరిశ్రమలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది, యాజమాన్యానికి పరిశ్రమ వ్యర్థాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీరు కరుణశ్రీ మాట్లాడుతూ పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలు, శుద్ధి చేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు.

అరకొర గదులు.. ఇబ్బందుల్లో విద్యార్థులు

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు

వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో దశలో పాఠశాలల్లో అదనపు గదులు, మరమ్మతు పనులు చేపట్టినా ఎక్కడా పూర్తి చేయకుండానే అర్ధాంతరంగా విడిచిపెట్టింది. దీంతో అరకొర గదులతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు గత కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా అసంపూర్తి గదులతో పాటు తరగతి గదులకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరండాల్లోనే పాఠాలు: తరగతి గదులు చాలకపోవడంతో వరండాల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. మరి కొన్ని చోట్ల రెండు, మూడు తరగతుల పిల్లలను కలిపి కూర్చోబెడుతున్నారు. నెలల తరబడి పనులు సాగుతుండటంతో చాలీచాలని గదుల్లో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. పాఠశాలల విలీనం నేపథ్యంలో ఇతర పాఠశాలల నుంచి వచ్చిన వారికి సరిపడా గదులు లేక ఉన్న గదుల్లోనే రెండు, మూడు తరగతుల పిల్లలను కూర్చోబెట్టి విద్యా బోధన సాగిస్తున్నారు. నియోజకవర్గంలోని నాడు-నేడు పాఠశాల భవనాల పనులు చేస్తున్న గుత్తేదారులకు సకాలంలో వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో చాలా చోట్ల కొంత కాలం కిందటే పనులు నిలుపుదల చేశారు.

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు రూ.68 లక్షలతో రెండో విడత నాడు-నేడులో భాగంగా మరమ్మతు పనులు ప్రారంభించారు. ఇక్కడ 286 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదనపు గదులకు మరమ్మతు పనులు చేస్తున్నందున ఉన్న గదులు చాలకపోవడంతో వరండాలు, పాఠశాల ఆవరణల్లో పూర్వ విద్యార్థులు నిర్మించిన గిడుగు రామమూర్తి కళాప్రాంగణంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు. రొట్టవలస జడ్పీ పాఠశాలకు రూ.1.07 కోట్లు మంజూరు చేశారు. ఇక్కడ 85 శాతం పనులు పూర్తి చేశారు. పురుషోత్తపురంలో 90 శాతం పనులు పూర్తి చేశారు.



పొందూరు: గోరింటలో పెచ్చులూడిన ఎంపీయూపీ పాఠశాల భవనం పైకప్పు

ఆమదాలవలస: మండలంలోని 34 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటివరకు 20 పాఠశాలల పనులు మాత్రమే పూర్తి చేశారు. 14 బడుల్లో వివిధ దశల్లో ఉన్నాయి.

పొందూరు: మండలంలోని 23 పాఠశాలలకు ప్రాథమిక-13, యూపీ-5, జడ్పీ-4, కేజీబీవీ-1 భవనాలకు పనులు మంజూరు చేశారు. పనులు చేసిన వరకు నిధులు అందలేదు. తరవాత నుంచి బిల్లులు రాకపోవడంతో నిర్మాణాలను గుత్తేదారులు నిలిపివేశారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా నాడు-నేడు కింద చేపట్టిన పనులు బిల్లులు కాకపోవడంతో గత ప్రభుత్వ హయాంలోనే నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. నిధులు మంజూరైతే పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. –రమణమూర్తి, జైరామ్, జగదీశ్వరరావు, సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు మండలాల జేఈలు

వంతెన పనులు త్వరలో ప్రారంభిస్తాం

గార, న్యూస్‌టుడే: గార, వనిత మండలం గ్రామాల మధ్య నిర్మిస్తున్న వంతెన పనులు త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం వంతెన పనులను పరిశీలించారు. తొలగించాల్సిన ప్రభుత్వ కార్యాలయ భవనాలను వేరే చోట వసతి కల్పించేందుకు సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నిలిచిపోయిన పనులన్నీ పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. 2017లోనే వంతెన పనులు యేడాది కాలంలో 64శాతం పూర్తి చేసేలా జరిగినప్పటికీ గత ప్రభుత్వంలో ఎటువంటి పురోగతి లేదన్నారు. తెదేపా నాయకులు బడగల వెంకటప్పారావు, పీస వెంకటరమణ, గుండ బాప్పురావు, తదితరులు పాల్గొన్నారు.



గారలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి

మాజీ మంత్రి ధర్మాన పరామర్శ

గార, న్యూస్‌టుడే: మండల కేంద్రం గారలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి తల్లి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ గొండు రఘురాం, పార్టీ శ్రేణులు రామారావు, గడ్డెయ్య, అప్పన్న ఉన్నారు.

కామర్స్ విద్యార్థుల హవా

కలెక్టరేట్(శ్రీకాకుళం): జిల్లాస్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్టులో బాగంగా నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ పి.సురేఖ తెలిపారు. వివిధ పోటీల్లో కామర్స్ విద్యార్థులు పలువురు విజేతలుగా నిలిచారని చెప్పారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

తితిదే భగవద్గీత గ్రంథాల పంపిణీ

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం ఏపీహెచ్‌బీకాలనీలో టీపీఎంహెచ్‌ఎం పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఉచితంగా భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే), హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమాల మేనేజర్ ఎం.లలితమణి తెలిపారు. తితిదే నుంచి జిల్లాకు 500 గ్రంథాలు వచ్చాయన్నారు.. భగవద్గీత కావాల్సినవారు 98669 14160, 95537 45950 చరవాణి నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మైనర్లు వాహనం నడిపితే చర్యలు తప్పవు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: మైనర్లు వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు హెచ్చరించారు. నగరంలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో శనివారం మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. లైసెన్స్ కలిగిన వాహనదారులు శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎస్సై వి.దేవానందం, ట్రాఫిక్ సిబ్బంది, మైనర్లు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిది

కలెక్టరేట్(శ్రీకాకుళం): పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ప్రతినిధులు డి.చందు, హరీష్ అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని పలు కళాశాలల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రభుత్వ, మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ పి. సురేఖ, కె.సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: వాణిజ్య పన్నుల శాఖ విజయనగరం డివిజన్ పరిధిలో బదిలీలు జరిగాయి. ప్రబంధకుడు వై.మన్మథరావును విశాఖ ద్వారకానగర్ సర్కిల్‌కు పంపారు. ఆయన స్థానంలో విశాఖ డాబాగార్డెన్స్ సర్కిల్ నుంచి సీహెచ్ నాగమల్లేశ్వరి రానున్నారు. నరసన్నపేట ఏసీ ఎస్.రమాకిరణ్‌ను ఏలూరుకు, కాశీబుగ్గ ఏసీ యు.శ్రీనివాసరావును విశాఖ సిరిపురం సర్కిల్‌కు బదిలీ చేసినట్లు ఆ శాఖ సంయుక్త కమిషనరు బి.నాగార్జునరావు తెలిపారు.

గుంతల్లో దిగబడిన వాహనాలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే మండలంలోని అలికాం-బత్తిలి రహదారిలో సరుబుజ్జిలి పెట్రోలు బంకు వద్ద ప్రమాదకరంగా ఏర్పడిన గుంతల్లో శనివారం వాహనాలు దిగబడిపోవడంతో ట్రాఫిక్‌కు అర్ధ గంట సమయం అంతరాయం ఏర్పడింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. కొంత సమయం తరువాత అందుబాటులో ఉన్న యంత్రం సహాయంతో వాహనాలను బ యటకు తీశారు. అనంతరం యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగాయి.



సర్వే వేగవంతం చేయండి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర-2047 సర్వే వేగవంతం చేయాలని వెలుగు ఏపీఎం కూర్మారావు అన్నారు. శనివారం మండలంలోని అక్కులపేట, తాళ్లవలస, మండాది, గాజులకొల్లివలస గ్రామాల్లో సిబ్బంది చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధితో కూడిన వ్యవస్థ కోసం ప్రజాభిప్రాయ సేకరణ కోసం డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీలు, వీవోలు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కళాకారులకు పుట్టినిల్లు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కళాకారులకు పుట్టినిల్లు అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని బాపూజీకళా మందిరంలో శనివారం స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్పీ బాలు వర్ధంతి, స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.నిక్కు అప్పన్న, గాయకులను అభినందించారు. అనంతరం శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య పూర్వ అధ్యక్షుడు లోకనాథం రామలింగస్వామిని సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారులు సురంగి మోహనరావు, బలివాడ మల్లేశ్వరరావు, డా.సుధీర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, డా.పులఖండం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం

ఆమదాలవలస గ్రామీణం: ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం ఆమదాలవలస మండలం అక్కులపేట గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా ప్రజా సమస్యలు గాలికి వదిలేసిందని అన్నారు.

డిప్యూటీ సీఎం ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా పూజలు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం తిరుపతిలోని వెంకటేశ్వర స్వామి లడ్డు అంశంలో చేసిన తప్పుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 11 రోజుల పాటు నిర్వహించిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా రణస్థలం మండలం గిరివానిపాలెంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జనసేన నేతలు పూజలు నిర్వహించారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలంలోని ప్రధాన రహదారిలో డొంకలపర్త కూడలి వద్ద శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు గాయపడ్డారు. దీంతో వీరిని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు వాహనం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు.

గురుకులంలో తనిఖీ

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలంలోని కొల్లివలస గురుకులాన్ని శనివారం రాత్రి డీసీవో బాలజీనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం భోజనశాలలోకి వెళ్లి మెనూ తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రిన్సిపల్ దేవేందరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ హర్షవల్లి సేవలు శ్లాఘనీయం



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ సుధీర్, శోభారాణి

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ హర్షవల్లి అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని పలువురు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలో ఇల్లీసుపురం కూడలి వద్ద శనివారం క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. నగరపాలక సంస్థ వైద్యాధికారి డాక్టర్ సుధీర్ కుమార్, లయన్స్‌క్లబ్ జోనల్ ఛైర్మన్ కరణం శోభారాణి ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపకుడు హారికా ప్రసాద్, శ్రీకాకుళం అధ్యక్షుడు వావిలిపల్లి జగన్నాథం నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలి



వర్సిటీలో రక్తదానం చేస్తున్న విద్యార్థి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలని డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలో జాతీయ సేవా పథకం, శ్రీకాకుళం సర్వజనాసుపత్రి బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. ఈ సందర్భంగా 75 మంది వలంటీర్లు రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం.అనురాధ, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు పి.జ్యోత్స్నరాణి, పీహెచ్‌సీ వైద్యులు ఎం.ఉషశ్రీ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది వై.మౌళీశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరసవల్లిలో స్వచ్ఛతా హీ సేవ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంద్రపుష్కరిణి, ఆలయ తూర్పు మాడవీధుల్లో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్యాధికారి పి.సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నవయుగ కవి చక్రవర్తి జాషువా



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల ఐకాస నాయకులు

శ్రీకాకుళం అర్బన్, కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువ అని వక్తలు కొనియాడారు. శ్రీకాకుళం నగరంలోని పూలే ఉద్యానవనంలో శనివారం జాషువా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐకాస నాయకులు కళ్లేపల్లి రామ్‌గోపాల్‌వర్మ, కంఠవేణు, తైక్వాండో శ్రీను జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐకాస నాయకులు సింకు రమణ, అరిబారిక రాజు, పెయ్యల చంటి, తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ★ ఇల్లీసుపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జయంతి జరిగింది.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలో ఈ నెల 27న జరిగిన పాఠశాల క్రీడా పోటీల్లో ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటారు. పీయూసీ-2 చదువుతున్న రెడ్డి శివసాయి 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ద్వితీయస్థానం, పి.రామరావు షాట్‌పుట్‌లో తృతీయ స్థానం కైవసం చేసుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డా. కె.వి.జి.డి.బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకాడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, పీడీలు అభినందించారు.

భాజపా సభ్యత్వ నమోదు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, నరేంద్ర, రాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మాతా శిశు మరణాలు నివారించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మధ్యలో ఆపేశారు..!

శ్రీకాకుళం నగరం రైతుబజార్ సమీపంలోని పరంకుశం కాలనీలో కొన్ని రోజుల కిందట ప్రారంభించిన సీసీ రహదారి పనులు మధ్యలో ఆపేశారు. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ సంబంధిత గుత్తేదారుకి నోటీసులు జారీ చేసి తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



అన్నంపేటలో ఇరువర్గాల ఘర్షణ

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలంలోని అన్నంపేటలో శనివారం రాత్రి రెండు కుటుంబాల వ్యక్తులు పాత కక్షల కారణంగా ఘర్షణ పడ్డారు. దీంతో వారిలో కొందరు గాయపడ్డారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స కోసం ఓ కుటుంబానికి చెందిన సభ్యులు హాజరైనట్లు పోలీసులు తెలిపారు. తమకు ఎటువంటి పిర్యాదు అందలేదని, వస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై ఎం.ప్రవల్లిక తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీన గ్రామానికి చెందిన కర్జం మహేష్ శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో ఉరేసుకొని మృతి చెంది ఉన్న విషయం విదితమే. తన మరణానికి కారణం గ్రామానికి చెందిన ఓ కుటుంబమని అతడు పేర్కొనడంతో ఈ కుటుంబాల మధ్య తగదా చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మండల స్థాయి పోటీలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: రానున్న అయిదేళ్లలో విద్యారంగంలో స్వర్ణాంధ్ర సాధించేందుకు చేపట్టాల్సిన సంస్కరణలపై శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. హైస్కూలు స్థాయి నుంచి స్కూల్ కాంప్లెక్స్ స్థాయికి ఎంపికైన 16 మంది విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు ఎంఈవో డి.బాలరాజు తెలిపారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30న జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంఐఎస్ పైడి మురళీకృష్ణ, సీఆర్ఎంటీలు చిన్నారావు, రోహిణి, చిరంజీవి పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

పట్టణంలోని గేటు ప్రధాన రహదారి మలుపు వద్ద ముళ్ల పొదలు, పనికిరాని మొక్కలను మున్సిపల్ సిబ్బంది శనివారం తొలగించారు. కొంత కాలంగా ఇవి రహదారిపైకి చొచ్చుకురావడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారితో పాటు విద్యార్థులు ముఖ్యంగా రాత్రి వేళల్లో వీటితో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై శుక్రవారం ‘ఈనాడు’లో ‘ముళ్లపొదలతో ప్రమాదం..!’ శీర్షికతో సమస్యా చిత్రాన్ని ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు స్పందించి వీటిని తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం,



వైకాపా నాయకుల పూజలు

ఆమదాలవలస పట్టణం, అరసవల్లి,పొందూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలను ఏమార్చడానికే తిరుమల లడ్డూ నాటకాన్ని తెరపైకి చంద్రబాబునాయుడు తీసుకువచ్చారని వైకాపా శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం ఆమదాలవలసలోని వేంకటేశ్వర దేవాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకాపా నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, కోట గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు. ★ పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో తప్పు జరిగే అవకాశమేలేదని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని నారాయణ తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆ పార్టీ శ్రేణులతో కలిసి శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే జగన్‌పై విమర్శలు చేస్తున్నారని, వాటిని మానుకుని ప్రజలకు మేలు చేయాలని హితవు పలికారు. ★ తిరుమల లడ్డూ ప్రసాదాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అపవిత్రం చేశారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ సామాజికవర్గ అధ్యక్షుడు దుంపల రామారావు, వైకాపా మండల అధ్యక్షుడు పప్పల రమేష్ అన్నారు. కోటిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకాపా నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆమదాలవలసలో వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వైకాపా నేత సీతారాం, ఇతర నాయకులు